ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3 జనగామ
సోమవారం 8 ఏప్రిల్ 2024



రంజాన్ వేళలు
ఇఫ్తార్ : సోమవారం సా : 6.36 గం.
సహర్ : మంగళవారం ఉ : 4.42 గం.

కాలువ పారలే.. పంటలు పండలే..

- పట్టించుకునేవారు లేక పెరిగిన పిచ్చిచెట్లు
- మట్టి పేరుకుపోయి ముందుకు సాగని జలాలు
- మరమ్మతు చేస్తే 4,451 ఎకరాలకు నీటి సౌకర్యం
- పాలకులు స్పందించాలని రైతుల డిమాండ్



2ఎల్ కెనాల్ ద్వారా రైతులకు అందని సాగునీరు

స్టేషన్‌ఘన్‌పూర్, ఏప్రిల్ 7: పాలకుల నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం మూలంగా స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో తలాపున నీళ్లున్నా పంటలకు అందించలేని దుస్థితి నెలకొంది. ఘన్‌పూర్ రిజర్వాయర్‌లో జలాలు సమృద్ధిగా ఉన్నాయన్న ఆశతో రైతులు యాసంగి పంటలు సాగుచేశారు. కాని మూడు నెలల్లోనే వారి ఆశలు అడియాశలయ్యాయి. ఫలితంగా చేతికివచ్చే పంట పశువులకు మేత అయ్యింది. పంటలు ఎండిపోవడంతో రైతులు ఎండినపంటలను చూసి కన్నీరు పెడుతున్నారు. పెట్టుబడి కోసం చేసిన అప్పులు తీర్చేది ఎలా అని ఆందోళన చెందుతున్నారు.

మెయిన్ కాలువలో సమృద్ధిగా జలాలు

ఘన్‌పూర్ రిజర్వాయర్ నుంచి పాలకుర్తి మెయిన్ కెనాల్ ద్వారా జలాలు పాలకుర్తి, చెన్నూరుకు వెళ్లుతు న్నాయి. అదేవిధంగా నవాబుపేట, అశ్వరావుపల్లి రిజర్వాయర్‌లకు సైతం సరఫరా అవుతున్నాయి. కాని ఘన్‌పూర్ రిజర్వాయర్ సమీపంలోని గ్రామాలకు మాత్రం సాగునీరు అందడం లేదు. దీంతో తలాపున నీళ్లున్నా ఉపయోగమేముందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కాలువ పక్కన బోరువేసినా కనిపించని నీరు

పూడుకుపోతున్న 2ఎల్ కెనాల్

ఘన్‌పూర్-పాలకుర్తి మెయిన్ కెనాల్‌కు అనుసంధానంగా 5వ కిలోమీటర్ (ఇప్పగూడెం) వద్ద 2ఎల్ కెనాల్ తూమును ఏర్పాటు చేశారు. ఇక్కడి నుంచి పాలకుర్తి మండలం గూడూరు వరకు సుమారు 10 కిలోమీటర్ల మేర గతంలో కాలువ నిర్మించారు. దీని కింద 4,451 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందడమే కాకుండా కాలువ సమీపంలోని కుంటలు చెరువులను సైతం నింపుకునే వెసులుబాటు ఉండేది. అయితే ఈ కెనాల్‌ను పట్టించుకునే వారు లేకపోవడంతో దాని నిండా పిచ్చిచెట్లు పెరిగిపోయాయి. అనేక చోట్ల మట్టి పేరుకుపోయి జలాలు ముందుకు వెళ్లడం లేదు.

మరమ్మతులు చేయాలి

పది కిలోమీటర్ల పొడవు ఉన్న 2ఎల్ కాలువలో అ క్కడక్కడ పేరుకుపోయిన పూడికను తొలగించి, కాలు వలో దట్టంగా పెరిగిన పిచ్చి చెట్లను తొలగిస్తే కెనాల్ ద్వారా జలాలు ముందుకు వెళ్లే అవకాశం ఉంది. వేలాది ఎకరాల్లో రైతులు పంటలను సాగు చేసుకుంటారు. ఇప్పటికైనా అధికారులు మేలుకొని కాలువకు మరమ్మతులు చేయాలని రైతులు వేడుకుంటున్నారు.

ఆశతో సాగు చేసిన రైతులు

2ఎల్ కెనాల్‌లో తాత్కలిక మరమ్మతులు చేబట్టి యాసంగి సాగుకు జలాలు విడుదల చేస్తారనే ఆశతో 2ఎల్ కెనాల్ వెంట ఉన్న రైతులు వందలాది ఎకరాల్లో వరి, మొక్కజొన్న పంటలను సాగు చేశారు. అయితే అధికారులు పట్టించుకోకపోవడంతో నీరందక పంటలు పూర్తిగా ఎండిపోయాయి. చేసేది ఏమీ లేక రైతులు చేన్లలో పశువులను మేపుకునే దుస్థితి ఏర్పడింది.

కెనాల్ ద్వారా సాగునీరందే గ్రామాలు

2ఎల్ కెనాల్ ద్వారా మూడు మండలాల్లో సుమా రు నాలుగు వేల ఎకరాలకు సాగునీరు అందేది. స్టేషన్‌ఘన్‌పూర్ మండలం ఇప్పగూడెం, సముద్రాల, నారాయణపురం, గోపాలపురం గ్రామాలతో పాటు జఫర్‌గడ్ మండలంలోని సూరారం, తీగారం, హిమ్మ త్‌నగర్, షాపల్లి గ్రామాలకు అదేవిధంగా పాలకుర్తి మండలంలోని గూడూరుతో పాటు సమీప గ్రామాల రైతులు పంటలు పండించుకునేవారు.

సాగునీటి కోసం అన్నదాతల పాట్లు

2ఎల్ కెనాల్‌పై ఆధారపడి పంటలను సాగుచేసిన రైతులు ఇపుడు జలాలు రాకపోవడంతో పెద్ద ఎత్తున బోరుబావులు వేస్తున్నారు. అయితే భూగర్భ జలాలు సైతం అడుగంటడంతో బోర్లలో నీరుపడడం లేదు. దీంతో రైతులు లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తున్నా ఫలితం ఉండడంలేదు. ఈ నేపథ్యంలో ఏం చేయాలో అర్థంకాక రైతులు తలలు పట్టుకుంటున్నారు.



ప్రభుత్వం ఆదుకోవాలి...
- బండి సమ్మయ్య, రైతు, సముద్రాల

నాకున్న మూడెకరాల భూమిలో కెనాల్ ద్వారా జలాలు వస్తాయనే ఆశతో వరిపంటను సాగుచేశాను. నీళ్లు రాకపోవడంతో చేతికివచ్చే దశలో పంట ఎండిపోయింది. ఎండిన చేనులో రోజు కొంత గేదెలను మేపుతున్నాను. రూ.90వేలు పెట్టుబడి పెట్టాను. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.



ఎప్పటిలాగే జలాలు వస్తాయనుకున్నాను..
- కత్తుల రాజు, రైతు, సముద్రాల

గత ఏడాది యాసంగిలో అధికారులు 2ఎల్ కెనాల్ ద్వారా జలాలు విడుదల చేయడంతో పంటలు పండించుకున్నాం. అదే మాదిరిగా ఈసారి కూడా జలాలు వస్తాయని అనుకొని మొక్క జొన్న సాగు చేశాను. పంట పూర్తిగా ఎండిపోయింది. అధికారు లు కాలువకు మరమ్మతులు చేసి జలాలు విడుదల చేయాలి.



ఏడు బోర్లు వేసినా ఫలితం లేదు..
- మ్యాకల నరేష్, రైతు, సముద్రాల

కాలువ ద్వారా జలాలు వస్తాయనే ఆశతో పంటలను సాగు చేశాను. తీరా జలాలు రాకపోవడంతో పంటలు కాపాడుకోవడానికి ఏడు బోర్లు వేసిన. అయినా ఒక్కదాంట్లో కూడా నీరు పడలేదు. దీంతో ఆర్థికంగా చాలా నష్టపోయాను. రూ.4లక్షల మేర అప్పు అయింది. ప్రభుత్వమే ఆదుకోవాలి.



ఎండిన వరిచేనులో గేదెలు మేపుతున్న రైతు సమ్మయ్య



ఎండిన మొక్కజొన్న చేనును చూపుతున్న రైతు రాజు

కాంగ్రెస్ ప్రభుత్వంలోనే ముస్లింల అభివృద్ధి

ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



పాలకుర్తిలో ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

పాలకుర్తి, ఏప్రిల్ 7: రాష్ట్రంలో ముస్లింల అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. ఆదివారం పాలకుర్తి బషారత్ గార్డెన్‌లో నిర్వహించిన ఇఫ్తార్ విందులో నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝూన్సీరెడ్డితో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మతసామరస్యం కోసం పాటుపడుతుంటే బీజేపీ మతాల మధ్య చిచ్చు పెడుతోందని విమర్శించారు. పవిత్ర రంజాన్ పండుగను ముస్లింలు ఎంతో భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారని అన్నారు. పండుగలు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని అన్నారు. నెల రోజుల పాటు ముస్లింలు ఉపవాస దీక్షలు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు రాపాక సత్యనారాయణ, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు మదార్, ఎర్రబెల్లి రాఘవరావు, నిరంజన్‌రెడ్డి, కాకిరాల హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఐలోని మల్లన్న కల్యాణం

50 అడుగుల పెద్దపట్నంపై శివతాండవం



ఆలయప్రాంగణంలో ఒగ్గు పూజారులు వేసిన 50 అడుగుల పెద్దపట్నం

ఐనవోలు, ఏప్రిల్ 7: ఐనవోలు మల్లికార్జునస్వామి వారాంతపు జాతరలో చివరి ఆదివారం మల్లన్న కల్యాణం, పెద్దపట్నంను అంగరంగా వైభవంగా నిర్వహించారు. శివరాత్రి ఉత్సవాలు ముగిశాక ఉగాదికి ముందు వైదిక పద్ధతిలో స్వామి వారికి కల్యాణం నిర్వహిస్తూ జానపదుల తంతులో పెద్దపట్నం వేయడం ప్రత్యేక తంతుగా నిలుస్తోంది. అందులో భాగంగా శ్రీ బలిజే మేడమ్మ, గొల్లకేతమ్మ అమ్మవార్ల సమేత మల్లికార్జునస్వామి కల్యాణం కనులపండువగా కనువిందు చేసింది. ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు కల్యాణానికి పట్టువస్త్రాలు తీసుకచ్చారు. వేద మంత్రాల నడుమ వైదిక పద్ధతిలో ఆలయ ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్ ఆధ్వర్యంలో ముఖ్య అర్చకుడు ఐనవోలు మధుకర్‌శర్మ, వేద పండితులు గట్టు పురుషోత్తంశర్మ, విక్రాంత్ వినాయక్ జోషి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఒగ్గు పెద్ద పూజారులు మజ్జిగ మహేందర్, మజ్జిగ మల్లయ్య, మజ్జిగ వెంకటనారాయణల ఆధ్వర్యంలో 30 మంది ఒగ్గుపూజారులు 7 గంటలు శ్రమించి 50 అడుగుల పెద్దపట్నంను అద్భుతంగా వేశారు.

పెద్దపట్నంపై శివతాండవం

మల్లన్న స్వామికి అత్యంత ప్రీతికరమైన పెద్దపట్నంను కాకతీయుల నృత్యమండపానికి ఉత్తరం వైపున 50 అడుగుల వెడల్పు పొడవుతో వివిధ రకాల చూర్ణములు(పిండి) ముగ్గులతో ఒగ్గు పూజారులు అందంగా పట్నం వేశారు. కల్యాణం తదుపరి ఉత్సవ విగ్రహాలతో ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు, అర్చకులు పట్నం చుట్టు ప్రదక్షణ చేశారు. పట్నంపైన శ్రీగొల్లకేతమ్మ, బలిజే మేడమ్మ అమ్మవార్ల సమేత మల్లన్నస్వామి ఉత్సవ విగ్రహాలను అవాహనం చేసి ఒగ్గుకథ ద్వారా కల్యాణం కథను పఠించారు. భక్తులు భక్తి పరవశ్యంతో పట్నంపై మండుటెండలో మైమరిచి నృత్యం.. శివతాండవం చేయడం కనువిందు చేసింది. ఐనవోలు, పర్వతగిరి ఎస్సైలు అనిల్‌కుమార్, జి.వెంకన్నల నేతృత్వంలో పోలీసులు పెద్దపట్నం వద్ద తొక్కిసలాట జరుగకుండా బందోబస్తు నిర్వహించారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులతో దేవస్థాన ప్రాంగణం కిటకిట లాడింది. శనివారం సాయంత్రం నుంచి ఆదివారం రాత్రి వరకు సుమారు లక్ష మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఉదయం స్వామి వారి మేలుకొలుపు సుప్రభాత ప్రాత:కాల పూజలు నిర్వహించారు. మహాన్యాసపూర్వక రుద్రాభిషేకాలు.. విశేష అభిషేకాలు కొనసాగాయి. .

ప్రశాంతంగా మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష



చౌడారం మోడల్ స్కూల్ లో పరీక్ష రాసేందుకు వెళుతున్న విద్యార్థులు

జనగామ కల్చరల్, ఏప్రిల్ 7: మోడల్ స్కూళ్లలో అడ్మిషన్లకు గాను నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. జిల్లా వ్యాప్తంగా 8 కేంద్రాలలో ప్రవేశ పరీక్ష నిర్వహించారు. వీటిలో 6వ తరగతిలో ప్రవేశాలకు 871 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 699 మంది విద్యార్థులు హాజరయ్యారు. అదే విధంగా 7 నుంచి 9 తరగతుల కోసం 382 మంది దరఖాస్తు చేసుకోగా 298 మంది హాజరయ్యారు. పరీక్షల సందర్భంగా డీఈవో కె.రాము, ఏసీజీఈ రవికుమార్ తో కలిసి ఘన్‌పూర్‌స్టేషన్, వెల్ది పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. పరీక్ష ప్రశాంతంగా జరిగి ందని డీఈవో తెలిపారు.

బీఆర్‌ఎస్ వాళ్లవి రాజకీయ డ్రామాలు

పాలకుర్తి, ఏప్రిల్ 7 : రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ రాజకీయ డ్రామాలు చేస్తోందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మార్కెట్ మాజీ చైర్మన్ ఎర్రబెల్లి రాఘవరావు విమర్శించారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ చిత్తుగా ఓడిపోయినా ఆ పార్టీ నాయకుల్లో ఎలాంటి మార్పు రాకపోవడం సిగ్గుచేటన్నారు. పంటలు ఎండిపోకున్నా ఎండిపోతున్నాయని బీఆర్‌ఎస్ పార్టీ దుష్ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. రైతు దీక్ష పేరుతో రోడ్డెక్కడం సిగ్గుచేటన్నారు. రిజర్వాయర్లలో నీటి నిలువలు లేకుండా చేసిన బీఆర్‌ఎస్ నాయకులే తిరిగి గగ్గోలు పెడుతున్నారని ఎద్దేవా చేశారు. మాజీ మంత్రి దయాకర్ రావు తమ ప్రభుత్వంపై బురదజల్లే ప్రచారాన్ని మానుకోవాలని హితవుపలికారు. సమావేశంలో మాజీ ఎంపీపీ గడ్డం యాకసోమయ్య, నాయకులు భాస్కర్, ఆదినారాయణ, పెనుగొండ రముష్, ఆంజనేయులు, మొలుగూరి యాకయ్య తదితరులు పాల్గొన్నారు.



పాలకుర్తిలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

గెలుపు కాదు.. అధిక మెజారిటీ సాధించాలి..

- వరంగల్ లోక్‌సభ ఎన్నికకు సన్నద్ధమవ్వండి..
- అభ్యర్థి గెలుపు కోసం సమన్వయంతో పని చేయండి
- జిల్లా నేతలతో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష, దిశా నిర్దేశం



వరంగల్ లోక్‌సభ ఎన్నిక విషయంలో జిల్లా నేతలతో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష

5లో

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

రఘునాథపల్లి, ఏప్రిల్ 7: ఆర్థిక ఇబ్బందులతో పాటు కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. ఫతేషాపూర్ గ్రామానికి చెందిన బండ వీరయ్య-వీరమ్మ దంపతుల చిన్న కుమారుడు ఉమేష్(32)కు ఏడాది క్రితం జనగామ పట్టణానికి చెందిన చైతన్యతో వివాహమైంది. ఉమేష్ వ్యవసాయంతో పాటు జనగామలో ఓ వైద్యురాలి వద్ద డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో దంపతుల మధ్య కొన్ని రోజులుగా ఆర్థిక సమస్యలతో గొడవలు జరుగుతున్నాయి. దీంతో చైతన్య పుట్టింటికి వెళ్లింది. శనివారం చైతన్యను తీసుకువస్తానని తండ్రితో చెప్పి వెళ్లిన ఉమేష్ సాయంత్రం ఫోన్ చేసి అత్తగారి ఇంటి వద్ద గొడవ జరిగిందని చెప్పి ఫోన్ కట్ చేశాడు. ఆదివారం ఉదయం వ్యవసాయ బావి వద్దకు వెళ్లేసరికి కుమారుడి ద్విచక్ర వాహనం కనిపించడంతో చుట్టు పక్కల వెతకగా, సమీపంలోని చెట్టు కింద ఉమేష్ పడిఉన్నాడు. అప్పటికే పురుగుల మందు తాగి చనిపోయాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ నరేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



బండ ఉమేష్ (ఫైల్)

పరీక్ష ఫెయిలైనందుకు డిగ్రీ విద్యార్థిని..

డిగ్రీ రెండో సంవత్సరం పరీక్షలో ఫెయిల్ కావడంతో మనస్తాపం చెందిన ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. రఘునాథపల్లి మండలం అశ్వరావుపల్లి గ్రామానికి చెందిన మాశ పరమేష్ కూతురు సోని (20) డిగ్రీ సెకండ్ ఇయర్ చదువుతోంది. ఇటీవల విడుదలైన సెమిస్టర్ ఫలితాల్లో ఫెయిల్ అయింది. దీంతో మనస్తాపం చెంది ఆదివారం రఘునాథపల్లి-యశ్వంతపూర్ రైల్వే స్టేషన్‌ల మధ్య నిడిగొండ బ్రిడ్జి సమీపంలో రైలు కింద పడి చనిపోయింది. రైల్వే పోలీస్ అధికారి ఆర్.రమణారెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనుభూతులను మూటగట్టుకుని..

- నిట్‌లో ముగిసిన స్ప్రింగ్ స్ప్రీ వేడుకలు
- కొత్తజ్ఞాపకాలతో విద్యార్థుల తిరుగుముఖం
- మూడు రోజుల పాటు సందడిగా క్యాంపస్
- ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు
- 50 ఈవెంట్ల నిర్వహణ.. అలరించిన ప్రోషోలు
- స్ఫూర్తి నింపిన డైరెక్టర్ కట్స్



హీరో నవదీప్‌తో విద్యార్థుల చిట్‌చాట్

వివరాలు : 5వ పేజీలో..

దేవుడి సొమ్ముకు ఎసరు

- ఏటీఎంలుగా మారిన దేవాలయాల ఆదాయం
- ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే రూ.3కోట్లు వాడకం
- తాజాగా మరో రూ.50లక్షలకు టెండరు
- దేవాదాయ శాఖలో ఓ అధికారి ఇష్టారాజ్యం

ఆలయాల భూములు ఒక వైపు ఆక్రమణదారుల కబ్జాలకు బలవుతుంటే.. మరోవైపు వాటి ఆదాయం అధికారుల పాలవుతున్నది. కొందరు తమ విలాసాలకు వాడుకుంటున్నారు. ప్రతీ జిల్లాలో ఒకటీ రెండు ప్రధాన దేవాలయాలను వారు ఏటీఎం కార్డుల్లా వినియోగించుకుంటున్నారు. ఆదాయం కలిగిన ఆలయాలపై కన్నేస్తున్నారు. వాటి నుంచి ఎప్పుడు పడితే అప్పుడు.. ఎంత పడితే అంత.. తమ సొంత సొమ్ములాగా వాడేసుకుంటున్నారు. భవన నిర్మాణం కోసమనో, లేక ఫర్నిచర్ కోసమనో ఎడాపెడా తీసేసుకుంటున్నారు. తాజాగా మడికొండలోని సుప్రసిద్ధ మెట్టు రామలింగేశ్వర స్వామి ఆదాయం నుంచి రూ.50లక్షలకు ఎసరు పెట్టారు. ఇప్పటికే నగరంలోని మూడు ప్రధాన ఆలయాల ఆదాయం నుంచి రూ.3.30 కోట్లను వాడేసుకున్నారు.



హనుమకొండ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలోని పాత సెంట్రల్ జైలుకు ఎదురుగా ఇటీవల నిర్మించిన ధార్మిక భవన్‌పై మరో అంతస్థు నిర్మాణం పేరుతో మడికొండలోని మెట్టు రామలింగేశ్వరాలయం ఆదాయం నుంచి రూ.50లక్షలను దేవాదాయ శాఖ అధికారులు మంజూరు చేయించుకున్నారు. దీనికి ఎక్స్‌టెన్షన్ పేరుతో చాలాకాలంగా దేవాదాయశాఖలో పాతుకుపోయి ఇటీవల బలవంతంగా బయటకు పంపివేయబడిన ఓ ఉన్నతాధికారి సహకారం ఉన్నట్టు తెలుస్తోంది. కేసీఆర్ కుటుంబసభ్యులకు అత్యంత సన్నిహితుడైన దేవాదాయ శాఖ ఉన్నతాధికారి.. తన పలుకుబడిని ఉపయోగించి ఆలయాల ఆదాయం నుంచి ఇష్టారాజ్యంగా నిధులను వాడుకుంటున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. తాజాగా మెట్టుగుట్ట గుడి నుంచి తీసుకున్న రూ.50 లక్షలతో పాటు భద్రకాళి గుడి, సమ్మక్క - సారలమ్మ జాతర నుంచి కూడా రూ.50 లక్షల చొప్పున మరో రూ.కోటి తీసుకునేందుకు కూడా అధికారులు ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. ఈ రెండు గుళ్ల నుంచి ఈ మొత్తాన్ని కూడా ఏదోరోజు లాగేసుకునే అవకాశాలు లేకపోలేదు. ఈ భవనం నిర్మాణానికి ఇప్పటికే ఈ మెట్టు రామలింగేశ్వరాలయం నుంచి రూ.కోటి, వరంగల్ భద్రకాళి గుడి నుంచి రూ.కోటి, సమ్మక్క - సారలమ్మ జాతర నుంచి రూ.కోటి తీసుకొని ఖర్చు చేశారు. ఇంతటితో సరిపెట్టుకోకుండా ఇటీవల ఈ ధార్మిక భవన్‌లో ఫర్నిచర్ కోసమని ఈ మూడు దేవాలయాల నుంచి రూ.10 లక్షల చొప్పున మరో రూ.30లక్షలను వాడుకున్నారు. ఒక్క సారిగా ఈ మొత్తం తీసుకుంటే భక్తుల నుంచి ఆగ్రహం చవిచూడాల్సి వస్తుందని అధికారులు వ్యూహాత్మకంగా విడతల వారీగా తీసుకుంటున్నారు. అది కూడా గుట్టు చప్పుడు కాకుండా వాడుకుంటున్నారు.

భక్తులను విస్మరించి..

నిజానికి కానుకల రూపంలో ఆలయాలకు సమకూరే ఆదాయాన్ని అభివృద్ధి, భక్తుల సౌకర్యాల కోసం ఖర్చు చేయాలి. కానీ దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు ఇందుకు భిన్నంగా తమ విలాసాల కోసం దేవుడి సొమ్మును ఫలహారం చేస్తున్నారు. ఆఫీసు భవనాలు, అందులో ఫర్నిచర్, ఇతర వసతుల కోసం రాష్ట్రప్రభుత్వం ఇచ్చే నిధులను

మిగతా 6వ పేజీలో...

ఓరుగల్లు వాసుల అభిమానం మరువలేనిది...

మీడియాతో సినీ హీరో నవదీప్

వడ్డెపల్లి, ఏప్రిల్ 7: ఓరుగల్లుతో తనకు ఉన్న అభిమానం మరువలేనిదని, అందమైన లోకేషన్లకు పెట్టింది పేరు ఓరుగల్లు నగరమని సినీ హీరో నవదీప్ అన్నారు. తాను నటించిన లవ్, మౌళి చిత్ర విశేషాలను ఆదివారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మీడియాకు వివరించారు. ఈ సందర్భంగా నవదీప్ మాట్లాడుతూ.. గతంలో తాను ఐదు సినిమాల్లో వైవిధ్యమైన పాత్రలు పోషించి ప్రేక్షకులకు గుర్తుండేలా మెప్పించానని అన్నారు. తాను నటించిన నూతన చిత్రం లవ్, మౌళి ఈ నెల 19న విడుదల కానుందని ప్రేక్షకులు, అభిమానులు ఆదరించాలని కోరారు. ఈ సినిమాలో తాను హీరోగా, పంఖురి గిద్వానీ హీరోయిన్‌గా నటించగా, మిగతా పాత్రల్లో భావన సాగి, మిర్చి హేమంత్, మిర్చి కిరణ్ నటిస్తున్నారని చెప్పారు. నైరా క్రియేషన్స్ అండ్ శ్రీకర బ్యానర్‌పై ఈ చిత్రాన్ని హైదరాబాద్‌లోని సిస్పేస్ స్టూడియోలో నిర్మిస్తున్నట్లు తెలిపారు. చిత్రానికి రచన, దర్శకత్వం, సినిమాటోగ్రఫీ, ఎడిటింగ్ అవనింద కాగా, సంగీత దర్శకులుగా గోవింద్ వసంత సమకూర్చగా పాటలను అనంత శ్రీరాం రాశారని వెల్లడించారు.


మాట్లాడుతున్న నవదీప్

‘ఉపాధి’లో మహిళలదే అగ్రస్థానం

● 2023-24లో ఎక్కువ పనిరోజులు వారివే.. ● కూలీ రేట్లు పెరగడంతో మహిళల్లో పెరిగిన ఉత్సాహం

హనుమకొండ కలెక్టరేట్, ఏప్రిల్ 7: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉపాధిహామీ కూలీ పనులు మహిళలకు వరంగా మారాయి. మహిళలు ఇంటిని చక్కబెట్టడమే కాకుండా కుటుంబ పోషణకు కావాల్సిన సహాయా న్ని తమవంతుగా చేస్తున్నారు. అలాగే పురుషులతో సమానంగా వ్యవసాయ కూలీ పనులు కూడా చేస్తూ తాము ఎందులో కూడా తక్కువ కాదని నిరూపిస్తున్నారు. 2023-24 ఏడాదిలో పని దినాలు వినియో గించుకున్న ఉపాధి హామీ కూలీల్లో పురుషులకంటే మహిళలే ముందు వరుసలో నిలిచారు. ఉపాధి హామీ పథకం ప్రారంభించిన మొదట్లో పురుషులు ఎక్కువగా పనులకు వెళ్లేది కానీ రోజులు గడుస్తున్న కొద్దీ ఈ పనుల్లో మహిళలు దూసుకెళుతున్నారు. మగవారితో సమానంగా పార, గడ్డపార చేతపట్టుకుని పనులు చేస్తున్నారు. మహిళలకు వారి వారి గ్రామాల్లోనే ఉపాధి హామీ పని దొరుకుతుండటంతో వారు వ్యవసాయ పనులు ఉన్న రోజులు మినహాయిస్తే మిగతా అన్ని రోజుల్లో ఉపాధి హామీ పనులు చేస్తున్నారు. ప్రస్తుతం హనుమకొండ జిల్లాలో ఉన్న 14 మండలాల్లో ఉపాధి హామీ పనులు జోరుగా సాగుతున్నాయి.

- పురుషులకంటే మహిళలే ఎక్కువ

2023-24 సంవత్సరంలో జిల్లాలో మొత్తం 25,97,662 మంది ఉపాధి హా మీ కూలీ పనులు చేయగా వీరిలో 60శాతం మహిళలే పని చేసినట్లు జిల్లా డీఆర్‌డీఏ అధికారులు తెలిపారు. 2023 సంవత్సరం జనవరి నెలలో 20,998, ఫిబ్రవరిలో 1,38,941, మార్చిలో 2,37,038, ఏప్రిల్ లో 3,56,672, మే నెలలో 4,03,576, జూన్‌లో 4,89,487, జులైలో 1,03,847, ఆగస్టులో 31,089, సెప్టెంబర్‌లో 23,406, అక్టోబర్‌లో 70,782, నవంబర్‌లో 97,376, డిసెంబర్ నెలలో 69,029 మంది ఉపాధి హామీ పనులు చేయగా, 2024 జనవరి నెలలో 62,471, ఫిబ్రవరి నెలలో 1,73,117, మార్చిలో 3,19,842 మంది



ఆత్మకూరు మండల కేంద్రంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న మహిళలు

కూలీలు ఉపాధి హామీ పనులు చేశారని, వీరిలో 60శాతం మహిళలు పని చేశారు.

- కూలీ రేట్లు పెరగడంతో ఉత్సాహం

మన రాష్ట్రంలో ఉపాధిహామీ కూలీ మార్చి 31 వరకు రూ.272 చెల్లించారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం కూలీ రేటు రూ.28 పెంచింది. ఈ నెల 1వ తేదీ నుంచి ఉపాధి హామీ కూలీలకు రూ.300 చెల్లిస్తున్నారు. కూ లీ రేట్లు కూడా పెరగడంతో మహిళలు ఉపాధి హామీ పనులు చేసేందుకు మరింత ఉత్సాహంతో సిద్ధంగా ఉన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి ఒక్క కూలీకి 100 రోజులు కల్పిస్తుంది. కూలీ రేటు పెరగకముందు కొందరు కూలీలు వారికి కేటాయించిన కనీసం 100 రోజులు పనులు కూడా చేసే వారు కాదని, ప్రస్తుతం కూలీ రేటు పెరగడంతో అందరు 100 రోజుల కూలీ చేస్తారని ఉపాధి హామీ కూలీలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఈజీఎస్‌లో ముఖ గుర్తింపు హాజరు

ఎన్‌ఎంఎంఎస్ యాప్ అందుబాటులోకి తీసుకొచ్చిన కేంద్ర ప్రభుత్వం

హనుమకొండ కలెక్టరేట్, ఏప్రిల్ 7 : ఉపాధి హామీ పనుల్లో కేంద్ర ప్రభుత్వం నూతన విధానానికి శ్రీకారం చుడుతోంది. ఉపాధి హామీ పనులకు వచ్చే కూలీలకు హాజరు విధానాన్ని అమలు చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. దీనిలో భాగంగా కూలీల ముఖ గుర్తింపు హాజరు విధానాన్ని అమలు చేసేందుకు సన్నద్ధమవుతోంది. దీనికోసం ఇప్పటికే నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ (ఎన్‌ఎంఎంఎస్)యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇప్పటికే జిల్లాలోని కొన్ని గ్రామాల్లో ఎన్‌ఎంఎంఎస్ యాప్ పనితీరును పరిశీలించారు. ఈ యాప్ వాడటానికి సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కూడా ఇచ్చారు.

పనుల్లో పారదర్శకతకు పెద్దపీట

ఉపాధిహామీ పనుల్లో కూలీలు అలా వచ్చి ఇలా వెళుతూ సరిగా పని చేయకుండానే కూలీ డబ్బులు తీసుకుంటున్నారనే ఆరోపణలు చాలా వరకు ఉన్నాయి. కూలీల హాజరు నమోదు విషయంలో తరచుగా వివాదాలు తలెత్తుతున్న సందర్భాలు చాలావరకు ఉన్నాయి. గతంలో చేసిన సామాజిక తనిఖీల్లో మస్టర్లపై ఎన్నో లోపాలు బయటపడ్డాయి. ఈ లోపాలను అడ్డుకట్ట వేసేందుకు, అర్హులైన కూలీలకు న్యాయం చేసేందుకు కూలీలకు ముఖ విధానం హాజరు అనేది ఎంతగానో ఉపయోగపడుతుందనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఆ యాప్‌ను అమలు చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. హనుమకొండ జిల్లాలో 208 గ్రామాలు ఉన్నాయి. సుమారు150 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు. 91వేల చిల్లర జాబ్ కార్డులు ఉండగా, ఇందులో 62వేల జాబ్ కార్డులు ఆక్టివ్‌గా ఉన్నాయి. జిల్లాలో మొత్తం ఒక లక్షా 4వేల మంది కూలీలు ఉన్నారు. జిల్లావ్యాప్తంగా ఉన్న జాబ్‌కార్డుల్లోని సభ్యులందరికీ ఇప్పటికే ఆధార్ కార్డును అనుసంధానం చేశారు. త్వరలో ఆ యాప్ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని డీఆర్‌డీఏ అధికారులు తెలిపారు.

హాజరు విధానం అమలు ఇలా..

ఉపాధిహామీ పని ప్రదేశాల్లో మొదటగా కూలీల ముఖ చిత్రాలను నమోదు చేస్తారు. తర్వాత కూలీ ఫొటో, ఆధార్‌తో అంతకుముందు దిగిన ఫొటో సరిపోలితేనే వారికి హాజరు పడుతుంది. కూలీలు పనిచేసే రోజు ఉదయం, మధ్యాహ్నం కూలీల ముఖ చిత్రీకరణ తప్పనిసరిగా ఉంటుంది. ఈ విధానం ద్వారా ఉపాధి పనుల్లో ఎలాంటి అక్రమాలు జరగకుండా ఉంటుందనేది కేంద్ర ప్రభుత్వం ఆలోచన. ఈ విధానం త్వరలో ఆచరణలోకి వచ్చే అవకాశం ఉంది.

మునిసిపాలిటీలకు అమృత్‌యోగం

- తాగునీటి వ్యవస్థ పటిష్టానికి చర్యలు
- ఉమ్మడి జిల్లాలో మునిసిపాలిటీలకు నిధులు కేటాయింపు

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 7: ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఐదు మునిసిపాలిటీలకు అమృత్ యోగం లభించింది. మునిసిపాలిటీల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ఇటీవల పెద్ద ఎత్తున నిధులు విడుదల చేసింది. ఈ నిధులతో కులాయి కనెక్షన్లు, ట్యాంకుల నిర్మాణం, కాలనీల అభివృద్ధి, పైప్‌లైన్‌ల ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం సంబంధిత అధికారులను ఆదేశించింది. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను శనివారం విడుదల చేసింది. అమృత్ -2 విడతలో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పరకాల, నర్సంపేట, జయశంకర్ భూపాలపల్లి, వర్ధన్నపేట ఐదు మున్సిపాలిటీలకు మొత్తం కలిగిస్తూ రూ.132కోట్లు విడుదల చేసిం ది. ఆయా జిల్లాల అధికారులకు బడ్జెట్‌కు సంబంధించిన ప్రొసీడింగ్‌లను జారీ చేసి ంది. దీంతో సంబంధిత మునిసిపాలిటీల అధికారులు అభివృద్ధి పనులు చేసేం దుకు కాంట్రాక్టర్‌లను కాల్‌ఫర్ చేసినట్టు తెలిపారు. కానీ లోక్‌సభ ఎన్నికల కోడ్ ఉండడ ంతో ఎలాంటి అభివృద్ధి పనులు చేయకూడదని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందడంతో పనులు నిలిపివేసినట్టు సంబంధిత అధికారులు వెల్లడించారు. అయితే ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఐదు మునిసిపాలిటీలలో పనులను బట్టి నిధులు విడుదల చేస్తామని మునిసిపాలిటీల వారిగా నిధులు విభజించలేదని తెలిపారు.

యూఐడీఎఫ్ ద్వారా బల్దియాకు నిధులు

ఈ యేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మునిసిపాలిటీల అభివృద్ధి కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించినా గ్రేటర్ వరంగల్ మునిసిపాలిటీకి అమృత్ -2 విడతలో భాగంగా ఎలాంటి నిధులు కేటాయించలేదు. మూడేళ్ల కిందట మొదటి విడతలో భాగంగా వరంగల్ బల్దియాకు అమృత్ పథకం ద్వారా 562 కోట్లు కేటాయించగా, ఆ నిధులతో గ్రేటర్ వరంగల్‌లోని 66 డివిజన్‌లలో ఇప్పటికి అభివృద్ధి పనులు జరుగుతూనే ఉన్నాయి. దీంతో వరంగల్ బల్దియాను మినహాయించి ఉమ్మడి జిల్లాలోని మిగతా ఐదు మునిసిపాలిటీలకు నిధులు కేయించినట్టు అధికారులు తెలిపారు. అయితే వరంగల్ నగర పాలక సంస్థకు కేటాయించిన అమృత్ నిధులు పూర్తయిన తర్వాత యూఐడీఎఫ్ (అర్బన్ ఇన్‌ఫ్రా డెవలప్ ఫండ్) ద్వారా ప్రత్యేక నిధులు విడుదల చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు సమాచారం. ఎన్నికలు ముగిసిన తర్వాత యూఐడీఎఫ్ నిధులు విడుదల చేస్తారనే ప్రచారం జరుగుతోంది. ఈ నిధుల ద్వారా వరంగల్ నగరంతో పాటు విలీన గ్రామాలు సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకోబోతున్నాయి.

ఉగాది పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 7: హైదరాబాద్‌లోని ఆల్ ది బెస్ట్ అకాడమీ ఆధ్వర్యంలో అందజేయనున్న ఉగాది పురస్కారాల కోసం దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఈఎస్ఎస్. నారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాహిత్య, సాంస్కృతిక సామాజిక సేవా రంగాల్లో సేవలందిస్తున్న ఆసక్తి కలిగిన వారు దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు. ఏప్రిల్ 21న హైదరాబాద్‌లో నిర్వహించే పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఎంపిక చేసిన వారికి పురస్కారాలు ప్రదానం చేస్తామని పేర్కొన్నారు. ఈ నెల 10లోగా దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా కోరారు. పూర్తి వివరాలకు 9652347207 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

ప్రశాంతంగా మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

వరంగల్, హనుమకొండ జిల్లాల్లోని మోడల్ స్కూల్లో ప్రవేశాల కోసం ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. వరంగల్ జిల్లాలో 910 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 665 మంది హాజరు కాగా 245 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. హనుమకొండ జిల్లాలో 660 మంది విద్యార్థులకు గాను 489 మంది హాజరుకాగా 171 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష ప్రశాంతంగా నిర్వహించడానికి సహకరించిన ప్రతీ ఒక్కరికీ డీఈవోలు అబ్దుల్ హై, వాసంతి కృతజ్ఞతలు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

హనుమకొండటౌన్, ఏప్రిల్7: ఎలాంటి అనుమతి లేకుండా తరలిస్తున్న ఇసుకట్రాక్టర్‌ను హనుమకొండ పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేశారు. వారి కథనం ప్రకారం.. సోమవారం ఉదయం కేయూ జంక్షన్‌లో పోలీసులు ట్రాక్టర్‌ను ఆపడానికి ప్రయత్నిస్తుండగా పోలీసులను చూసి ట్రాక్టర్ దిగి పారిపోయేందుకు యత్నించాడు. డ్రైవర్ అనుమల సొమయ్యను అదుపులోకి తీసుకొని విచారించగా ఎలాంటి ఆధారాలు చూపించలేదు. ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

గెలుపు కాదు.. అధిక మెజారిటీ సాధించాలి..

● వరంగల్ లోక్‌సభ ఎన్నికకు సన్నద్ధమవ్వండి.. ● జిల్లా నేతలతో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష.. దిశా నిర్దేశం

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 7: వరంగల్ లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ విజయమే కాదు.. అత్యధిక మెజారిటీ సాధన లక్ష్యంగా పని చేయాలని జిల్లా నేతలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. వరంగల్ లోక్‌సభ ఎన్నిక, పార్టీ విజయం, మెజారిటీ, నియోజకవర్గాల వారిగా పార్టీ పరిస్థితి, ఎన్నిక ప్రచార సభలు, కమిటీల నిర్మాణం, నేతల బాధ్యతలు తదితర అంశాలపై మంత్రి కొండా సురేఖ, వరంగల్ లోక్‌సభ అసెంబ్లీ సెగ్మెంట్ల ఎమ్మెల్యేలు, జిల్లా పార్టీ అధ్యక్షులు, ఇతర ముఖ్య నేతలతో ఆదివారం రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లో సమీక్ష జరిపారు. పార్టీ గెలుపు కోసం దిశా, నిర్దేశం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ గెలుపు సాధించడంతో ఢిల్లీ అధిష్ఠానం ఇక్కడి నుంచి ఎంపీ సీట్లపై దృష్టి పెట్టిందన్నారు. ఈ క్రమంలో మరింత కష్టపడి చేయాల్సిన బాధ్యత నెలకొందన్నారు. 14 ఎంపీ స్థానాలను గెలిపించి అధిష్ఠానం ఆశలను నెరవేర్చే లక్ష్యంతో ఉన్నట్లు రేవంత్‌రెడ్డి జిల్లా నేతలకు తెలియచేశారు. ఈ క్రమంలో ప్రతీ సీటు కోసం అహర్నిశలు కృషి చేయాలన్నారు. ఎన్నికల్లో టికెట్ అందరూ ఆశిస్తారని, అయితే అధిష్ఠానం అన్ని కోణాల్లో ఆలోచించి నిర్ణయం తీసుకుందని రేవంత్‌రెడ్డి జిల్లా నేతలకు సూచించారు. పార్టీకి సేవలందించిన అందరికీ న్యాయం చేస్తుందని, ఈ విషయంలో ఎలాంటి సందేహానికి తావు లేదన్నారు. ఈ బాధ్యత తనదిగా గుర్తించాలని పేర్కొన్నారు. అధిష్ఠానం ప్రకటించిన అభ్యర్థి డాక్టరు కడియం కావ్యను అత్యధిక మెజారిటీతో గెలిపించేలా కృషి చేయాలని జిల్లా నేతలకు ఉద్బోధించారు. టికెట్ దక్కని వారు నిరాశ చెందొద్దని, న్యాయం చేస్తానని రేవంత్‌రెడ్డి భరోసా ఇచ్చారు. వరంగల్ లోక్‌సభ పరిధిలోని అసెంబ్లీ సెగ్మెంట్లలో గ్రామస్థాయి నుంచి పార్టీ విజయ వ్యూహాల ప్రణాళికలను రూపొందించాలని రేవంత్‌రెడ్డి సూచించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులు, జిల్లా అధ్యక్షులు ఈ విషయంలో అందరినీ సమన్వయం చేసుకుంటూ నివేదికలు సిద్ధం చేసి అందచేయాలని ఆదేశించారు. ప్రతికూల పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిష్కరించే చర్యలు చేపట్టాలని సూచించారు. లోక్‌సభ ఎన్నిక నేపథ్యంలో ఈ నెల 18లోగా బూత్‌స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు కమిటీలు నిర్మించాలని సీఎం సూచించారు. కమిటీలను నిర్మించి బాధ్యతలను స్పష్టం చేయాలన్నారు. కమిటీలు పనితీరును బేరీజు వేసుకొని భవిష్యత్తులో వారికి పార్టీ గుర్తింపు ఇస్తుందన్నారు. ఎన్నికల క్రమంలో వరంగల్ లోక్‌సభ పరిధిలో మూడు ప్రచార సభలకు హాజరు అవుతానని రేవంత్‌రెడ్డి జిల్లా నేతలకు తెలియచేశారు. రెండు నుంచి మూడేసి నియోజకవర్గాలను కలిపి ఒక ప్రచారసభ నిర్వహణ ఉండేలా ప్రణాళికలు ఉంటాయన్నారు. దీనిపై త్వరలోనే స్పష్టత ఇవ్వనున్నట్లు నేతలకు సూచించారు. అగ్రనేతలు రాహుల్‌గాంధీ లేదా ప్రియాంకగాంధీ కూడా ఎన్నిక ప్రచార క్రమంలో వరంగల్ వచ్చే అవకాశం



సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న వరంగల్ జిల్లా కాంగ్రెస్ నేతలు

ఉంటుందని పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల కాంగ్రెస్ మేనిఫెస్టో ప్రజాదరణ పొందేలా రూపకల్పన చేశారన్నారు. తుక్కుగూడ సభలో ప్రకటన తర్వాత ప్రజల నుంచి భారీ స్పందన లభిస్తోందన్నారు. ఈ క్రమంలో మేనిఫెస్టోను గ్రామ గ్రామంలో ఇంటింటికీ తీసుకెళ్తే విజయం తథ్యమన్నారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ఏ భేషాజాలు లేకుండా ప్రతీ ఒక్కరు సమన్వయంతో పని చేయాలని రేవంత్‌రెడ్డి దిశా, నిర్దేశం చేశారు. ఈ సమీక్ష సమావేశంలో ప్రభుత్వ ప్రధాన సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, మంత్రి కొండా సురేఖ, వరంగల్ లోక్‌సభ ఇన్‌చార్జి, ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, నాగరాజు, యశస్వినిరెడ్డి, గండ్ర సత్యనారాయణ, కడియం శ్రీహరి, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, గ్రంథాలయ సంస్థ రాష్ట్ర చైర్మన్ డాక్టరు రియాజ్, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, టీపీసీసీ ఎస్సీ సెల్ నాయకుడు మోజెస్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

తప్పక న్యాయం చేస్తా..

వరంగల్ లోక్‌సభ టికెట్ ఆశించి భంగపడ్డ వారిలో సమీక్షకు హాజరైన దొమ్మాటి సాంబయ్య, నమిండ్ల శ్రీనివాస్, బొడ్డు సునిత మోజెస్ తదితరులతో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. కడియం కావ్య గెలుపు కోసం పని చేయాలని, భవిష్యత్తులో తప్పక న్యాయం చేస్తానని, ఇది తన భరోసా అంటూ నచ్చ చెప్పారు. మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా టికెట్ ఆశించి నిరాశ పడిన వారిని స్వయంగా కలిసి మాట్లాడాలని సూచించారు.

15 నుంచి కేయూ ఎంఫార్మసీ పరీక్షలు

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 7: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఏప్రిల్ 15 నుంచి ఎంఫార్మసీ మొదటి సెమిస్టర్ రెగ్యులర్ విద్యార్థులకు 2023-24 ఏడాదికిగాను పరీక్షల నిర్వహిస్తామని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ చాడ రాధికారెడ్డి ఆదివారం షెడ్యూల్‌ను ప్రకటించారు. ఏప్రిల్ 15, 18, 20, 22తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు.

16 నుంచి బీపీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షలు

ఏప్రిల్ 16 నుంచి కేయూ పరిధిలో బీపీఈడీ మొదటి సెమిస్టర్ రెగ్యులర్, ఎక్స్ ఇంప్రూమెంట్ అభ్యర్థులకు పరీక్షల నిర్వహిస్తామని కేయూ పరీక్షల నియంత్రణాధికారులు వెల్లడించారు. ఏప్రిల్ 16, 18, 20, 22 ,తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షల జరుగుతాయని తెలిపారు. కేయూ క్యాంపస్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల, ఖమ్మంలోని యూనివర్సిటీ పీజీ కళాశాలలో సెంటర్లు ఏర్పాటు చేశారు.

18 నుంచి ఎంపీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షలు

ఏప్రిల్ 18 నుంచి కేయూ పరిధిలో బీపీఈడీ మొదటి సెమిస్టర్ రెగ్యులర్, ఎక్స్ ఇంప్రూమెంట్ అభ్యర్థులకు పరీక్షల నిర్వహిస్తామని కేయూ పరీక్షల నియంత్రణాధికారులు వెల్లడించారు. ఏప్రిల్ 18, 20, 23, 25 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు పరీక్షల జరుగుతాయని తెలిపారు. కేయూ క్యాంపస్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలలో పరీక్షల సెంటర్‌ను ఏర్పాటు చేశారు.

16 నుంచి ఎంపీఈడీ మూడో సెమిస్టర్ పరీక్షలు

ఏప్రిల్ 16 నుంచి కేయూ పరిధిలో ఎంపీఈడీ మూడో సెమిస్టర్ రెగ్యులర్, ఎక్స్ ఇంప్రూమెంట్ అభ్యర్థులకు పరీక్షల నిర్వహిస్తామని కేయూ పరీక్షల నియంత్రణాధికారులు వెల్లడించారు. ఏప్రిల్ 16, 19, 22, 24 తేదీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు పరీక్షల జరుగుతాయన్నారు. కేయూ క్యాంపస్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల, ఖమ్మంలోని యూనివర్సిటీ పీజీ కళాశాలలో సెంటర్లు ఏర్పాటు చేశారు.

కేయూ బీఫార్మసీ సెమిస్టర్ ఫీజుల చెల్లింపు గడువు 18

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 6: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో బీఫార్మసీ సీబీసీఎస్ రెండు, నాలుగో, ఆరో రెగ్యులర్, సప్లిమెంటరీ, ఇంప్రూమెంట్ అభ్యర్థులు ఏప్రిల్ 18 వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఫీజులు చెల్లించుకోవాలని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్‌చాడ రాధికారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ. 250 అపరాధ రుసుంతో ఏప్రిల్ 20 వరకు ఫీజులు చెల్లించుకునే అవకాశం ఉందన్నారు. పరీక్షలు ఏప్రిల్, మేలో నిర్వహిస్తామని వెల్లడించారు. ఇతర వివరాలకు కేయూ వెబ్‌సైట్‌లో చూడాలని కోరారు.

ఎంహెచ్‌డీ జిల్లా అధికార ప్రతినిధిగా ప్రసాద్

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 7: మాదిగ హక్కుల దండోరా (ఎంహెచ్‌డీ) ఉమ్మడి వరంగల్ జిల్లా అధికార ప్రతినిధిగా కేతపాక ప్రసాద్ ఆదివారం నియమితులయ్యారు. మాదిగ హక్కుల కోసం, ఆత్మ గౌరవం, అభివృద్ధి కోసం నిస్వార్థంగా పోరాడాలని ఎంహెచ్‌డీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గనిపాక ప్రదీప్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

వరంగల్ క్రైం, ఏప్రిల్7: అతివేగంగా వచ్చిన కారు ఢీకొట్టడంతో టూవీలర్‌పై వెళుతున్న గిన్నారపు రాజు(34) మృతి చెందిన సంఘటన హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. హౌస్ షిఫ్టింగ్ వర్క్ చేసే అనంతసాగర్ గ్రామానికి చెందిన రాజు ఆదివారం ఉదయం హనుమకొండకు వస్తున్న క్రమంలో హసన్‌పర్తి చెరువు వద్ద హనుమకొండ నుంచి కరీంనగర్ వెళుతున్న కారు ఢీకొట్టింది. వేగంగా ఢీకొట్టడంతో పక్కన పొలాల్లో ఎగిరిపడిన రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. తన భర్త మృతికి కారణమని కారు డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాని రాజు సతీమణి రాధ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు.

సమస్యల పరిష్కారమే పీఆర్‌టీయూ ధ్యేయం

రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి పులి దేవేందర్ ముదిరాజ్

న్యూశాయంపేట, ఏప్రిల్ 7 : సమస్యల పరిష్కారమే పీఆర్‌టీయూ ధ్యేయమని రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి పులి దేవేందర్ ముదిరాజ్ అన్నారు. హంటర్ రోడ్డులోని ఉమ్మడి వరంగల్ జిల్లా యూనియన్ కార్యాలయంలో పీఆర్‌టీయూ ములుగు జిల్లా అధ్యక్షుడు వాంకుడోతు జ్యోతి అధ్యక్షతన ఉమ్మడి జిల్లా సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి పులి దేవేందర్ ముదిరాజ్ హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయ సమస్యలు ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే శాశ్వతంగా పరిష్కారం చేయాలని కోరారు. కొందరు రాజకీయ నాయకులు ఉపాధ్యాయ సంఘం పేరుతో స్వార్థ ప్రయోజనాల కోసం పాకులాడుతున్నారని అలాంటి వారి మాటలకు మోసపోవద్దని సూచించారు. అనంతరం ములుగు జిల్లా అధ్యక్షుడు జ్యోతి మాట్లాడుతూ.. ఈ వేసవిలో బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని, ఉపాధ్యాయ ఉద్యోగుల డీఏలు త్వరగా మంజూరు చేయాలని అన్నారు. ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి కొయ్యడ సురేందర్ మాట్లాడుతూ.. మేనిఫెస్టోలో చేర్చిన సీపీఎస్ రద్దు అంశాన్ని త్వరగా పరిష్కారం చేయాలని, ప్రభుత్వం కాలయాపన చేయవద్దని కోరారు. కార్యక్రమంలో వరంగల్ జిల్లా అధ్యక్షుడు తాళ్లపెల్లి రాజు, ప్రధాన కార్యదర్శి హర్షం సురేష్, భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు రాచర్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పసుల శంకర్, జనగాం అధ్యక్షుడు మరిపూకల యాదగిరి, ప్రధాన కార్యదర్శి వాంకుడోతు రవి, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు వల్లబోజు సుధాకర్‌లతో పాటు ములుగు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రౌతు రాజు, రాష్ట్ర నాయకులు రామగిరి సురేష్, జిల్లా నాయకులు సంతోష్, చిరంజీవిలతో పాటు వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పులి దేవేందర్ ముదిరాజ్

అనుభూతులను మూటగట్టుకుని..

● నిట్‌లో ముగిసిన స్ప్రింగ్ స్ప్రీ వేడుకలు ● మూడు రోజుల పాటు సందడిగా క్యాంపస్

హనుమకొండ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ప్రతిష్ఠాత్మకమైన వరంగల్ నిట్‌లో మూడు రోజులపాటు వైభవంగా జరిగిన స్ప్రింగ్ స్ప్రీ (వసంతోత్సవం) ఆదివారం ముగిసింది. వరంగల్ నిట్‌తో పాటు దేశంలోని 40 ఇంజనీరింగ్ కళాశాలల నుంచి పాల్గొన్న విద్యార్థులు ఈ వేడుకల్లో ఉత్సాహంగా, ఉల్లాసంగా పాల్గొన్నారు. స్ప్రింగ్ స్ప్రీని పురస్కరించుకొని నిర్వహించిన 50కిపైగా ఈవెంట్లలో పాల్గొని తమ సత్తాను చాటారు. ప్రతిభాపాటవాలను ప్రదర్శించి బహుమతులను గెలుచుకున్నారు. విద్యార్థులు తమలోని సృజనా త్మకతను చాటేందుకు ఈ వేడుకలు వేదికగా నిలిచాయి. కొత్త పరిచయాలు ఏర్పడ్డాయి. సరికొత్త అనుభూతులు, మరిచిపోలేని జ్ఞాపకాలతో విద్యార్థులు ఇళ్లకు తిరుగు ముఖం పట్టారు.

చివరి రోజు ఈవెంట్లు

ఆదివారం ముగింపు రోజున యూత్ రెడ్ క్రాస్ క్లబ్ ఆధ్వర్యంలో స్కావెంజర్ హంట్ ఈవెంట్ జరిగింది. క్యాంపస్‌లోని వివిధ ప్రదేశాల్లో వైద్య చికిత్సలో ఉపయోగించే కత్తెర, కాటన్ డెట్టాల్, మెడికల్ కిట్ వస్తువులను ఉంచారు. కొన్ని సూచనలు, ఆధారాల సాయంతో విద్యార్థులు వీటిని గుర్తించడం ఈ వెంట్‌లోని అంశం. కరోకే అనే మరో ఈవెంట్‌ను కూడా నిర్వహించారు. కొందరికి వేదికల మీద పాటలు పాడడమంటే భయం. ఆ భయాన్ని తొలగించే ఉద్దేశంతో ఈ ఈవెంట్‌ను నిర్వహించారు. వాట్స్ డిఫరెంట్ అనే ఈవెంట్ కూడా విద్యార్థుల ప్రతిభకు పరీక్ష పెట్టింది. రెండు సారూప్య ఇతివృత్తాల మధ్య వ్యత్యాసాలను ఇచ్చిన సమయంలోనే గుర్తించడం ఈ ఈవెంట్ ప్రత్యేకత. వరంగల్ నిట్ సోలో ఐడల్ ఈవెంట్‌లో పాల్గొన్న విద్యార్థులు పాటలు పాడారు. ఇందులో బాగాపాడిన వారు ఆదివారం నిర్వహించిన చివరి రౌండ్‌లో సింగిల్‌లో పాల్గొన్నారు. ఇందులో బాగా పాడినవారిని విజేతలుగా ప్రకటించి బహుమతులను అందచేశారు. మేళా అనే ఈవెంట్‌లో పాల్గొన్న విద్యార్థులు కొన్ని ఆటలను ఆడారు. వారి స్కోర్ ఆధారంగా విజేతలుగా ప్రకటించారు.

ప్రతిభకు కొలమానంగా ఈవెంట్లు

స్ప్రింగ్ స్ప్రీలో విద్యార్థులను విశేషంగా ఆకట్టుకోవడమే కాకుండా ఆలోచింప




నిట్ నుంచి తరలివెళ్తున్న విద్యార్థినులు

చేసిన ఈవెంట్ నుక్కడ్ నాటక్. వివిధ సామాజిక అంశాలను ఇతి వృత్తంగా ఎంచుకొని విద్యార్థులు వివిధ పాత్రలతో నటించిన ఈ ఈవెంట్ వాస్తవానికి ఒక వీధి నాటకం. కొరియో నైట్స్ ఈవెంట్ కూడా విద్యార్థుల ప్రశంసలను అందుకున్నది. స్ప్రింగ్‌స్ప్రీలో భాగంగా మూడురోజులు పాటు రాత్రిపొద్దుపోయిన తర్వాత ప్రదర్శించిన పాప్‌షోలు విద్యార్థులను ఉర్రూత లూగించాయి. శనివారం రాత్రి ప్రముఖ గాయకుడు నకాష్ అజీజ్ మ్యూజిక్ షోలో పాల్గొన్న విద్యార్థులు పాటలకు అనుగుణంగా చిందులేశారు. అంతకు ముందు రోజు చౌరస్తా బ్యాండ్, హరిచరణ్ బ్యాండ్ ప్రోఫ్‌షోలు కూడా విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ వేడుకలు విజయవంతం కావడంలో నిట్ కల్చర్ సొసైటీ, నిట్ డ్రామా అండ్ మ్యూజిక్ క్లబ్ విశేషంగా కృషి చేశాయి. కోఆర్డినేటర్లు చందర్, సాహిత్, తనీష్, ప్రశాంత్ నేతృత్వంలో వివిధ విద్యార్థి బృందాలు స్ప్రింగ్‌స్ప్రీ విజయవంతంలో తమ వంతు పాత్రను పోషించారు. స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ శ్రీనివాసాచార్య తన సహకారాన్ని అందించారు.

ఏకాంతంగా ఆలోచిస్తే జీవితంలో ఏమి కావాలో తెలుస్తుంది..

నిట్ స్ప్రింగ్ స్ప్రీలో విద్యార్థులతో హీరో నవదీప్

హనుమకొండ టౌన్, ఏప్రిల్7: ఏకాంతంగా ఆలోచనలు చేస్తే జీవితంలో మనకేమీ కావాలనేది దొరికిపోతుందని హీరో నవదీప్ విద్యార్థులకు సూచించారు. నిట్ స్ప్రింగ్‌స్ప్రీలో భాగంగా ఆదివారం కళాశాల ఆడిటోరియంలో విద్యార్థులతో నవదీప్ చిట్‌చాట్ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానమిచ్చారు. 18 ఏళ్ల వయస్సులోనే సినిమా అవకాశాలు రావడంతో వరుసగా సినిమాలు చేసుకుంటూ పోయానని, ఏ రోజు నాకు ఏమీ కావాలి.. అని ఆలోచన చేయలేదన్నారు. కరోనా సమయంలో జీవితంలో నాకేమి కావాలి అనే ఆలోచనలు మొదలైనప్పటి నుంచి జీవితంలో చాలా మార్పులు చోటు చేసుకున్నాయని, జీవితం గతంకన్నా బెటర్‌గా ముందుకెళుతోందన్నారు. సరిగ్గా ఆలోచన చేస్తే కావాల్సింది దొరుకుతుందని సూచించారు. ప్రతిభ ఎవరి సొత్తు కాదని, అవకాశాలు కోసం ఎక్కడా తిరగాల్సిన అవసరం లేదని, ఇంట్లో ఉండి యూట్యూబ్‌లో కంటెంట్ ఉన్న వీడియో అప్‌లోడ్ చేస్తే అవకాశం నిన్నే వెతుకుంటూ వస్తుందన్నారు. హీరో కాకపోతే ఏమి అయ్యేవారని విద్యార్థులు అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ.. పక్కాగా ఉదయం 9 నుంచి 5 గంటల వరకు ఒకరి కిందనైతే పని చేసేవాడిని కాదన్నారు. తన ఫిట్‌నెస్‌కు వారంలో ఆరు రోజులు జిమ్ చేయడమే కారణమన్నారు. క్లాస్‌లో ఫస్ట్ బెంచా.. లాస్ట్ బెంచా.. అని విద్యార్థులు అడిగిన ప్రశ్నకు క్లాస్ అవుట్ స్టాండింగ్ స్టూడెంట్ అని క్లాస్ బయటనే ఉండేవాడినని ఫన్నీగా సమాధానమిచ్చి అందరినీ నవ్వించారు. సమయం దొకినప్పుడు ట్రావెల్ చేస్తే కొత్త ప్రాంతాలు, వ్యక్తుల పరిచయం ద్వారా నాలెడ్జ్ పెంపొందించుకోవచ్చన్నారు. మీరు మెకానికల్ ఇంజనీరులైతే.. నేనే లైఫ్ ఇంజనీర్ అని విద్యారుంథల్లో ఆత్మస్థైర్యాన్ని నింపారు.



విద్యార్థులతో సెల్ఫీ దిగుతున్న హీరో నవదీప్

తన అభిమాన క్రికెటర్ ధోని, నటుడు చిర ంజీవి అని చెప్పుకొచ్చారు. కొన్ని సినిమాలు ఫ్లాప్ కావడానికి అవగహనలేని దర్శకులతో సినిమాలు ఒప్పుకోవడమే కారణమన్నారు. కాగా, విద్యార్థులతో జరిగిన చిట్‌చాట్‌లో పలు ప్రశ్నలకు సమాధానమిచ్చి వారిలో స్ఫూర్తి నింపారు. తన జీవితానికి దగ్గరగా ఉన్న కథతో నిర్మించిన లవ్ మౌళీ సినిమాలో హీరో గా నటించానని, ఈ నెల 19న విడుదల వుతుం దని, ప్రతి ఒక్కరూ ఆదరించాలని నవదీప్ కోరారు.

ఫిల్మ్ మేకింగ్‌లో చాలా ఒడిదొడుకులుంటాయి..

సీతారామం డైరెక్టర్ హను రాఘవపూడి

హనుమకొండ టౌన్, ఏప్రిల్7: ఫిల్మ్ మేకింగ్ అంటే చాలా ఒడిదొడుకులు ఉంటాయని సీతారామం చిత్ర దర్శకుడు హను రాఘ వపూడి అన్నారు. మూడు రోజుల నిట్ స్ప్రింగ్ స్ప్రి కార్యక్రమంలో భాగంగా ఆదివారం నిట్‌లోని ఏఎల్‌సీ ఆడిటోరియంలో విద్యార్థులతో డైరెక్టర్ చిట్ చాట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 19 ఏళ్లకే చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టి చాలా అడ్డంకులను ఎదుర్కొన్నానన్నారు.



తన సినిమాల్లో విషాదకరమైన అంశాలు ఎక్కువ గా ఉండటానికి కారణం ప్రజలు సంతోషాలకన్నా విషాదకరమైన అంశాలే ఎక్కువగా గుర్తుంచుకోవడం వలన అన్నారు. సీతారామం షూటింగ్ సమయంలో కశ్మీర్‌లో ప్రతికూల వాతావరణంలో పనిచేయా ల్సి వచ్చిందన్నారు. డైరెక్టర్ కావాలంటే పుస్తక పఠనం బాగా చేయాలన్నారు. జాబ్ మీద ఆసక్తి లేక సినిమాల వైపు వచ్చానన్నారు. దర్శకుడు చంద్రశేఖర్ ఏలేటి వర్క్ స్టైల్‌ను ఇష్టపడుతానన్నారు.

మట్టి పాత్రలే మేలు

తాగునీటికి, వంటలకు శ్రేష్ఠమంటున్న నిపుణులు



కొడకండ్లలో కుండలు చేస్తున్న కుమ్మరి

కొడకండ్ల ఏప్రిల్ 7: వేసవి కాలం భానుడు భగభగ మండుతున్నాడు. ఉదయం పది దాటితే బయటికి వెళ్లే పరిస్థితి ఉండడంలేదు. ఉపశమనం కోసం జనాలు కూల్‌డ్రింక్‌లు, ఐస్ వేసిన పండ్ల రసాలు తాగితే దాహం తీరక పోగా అనారోగ్యం పాలవుతున్నారు. ఈ నేపథ్యంలో మట్టితో చేసిన కుండలు, రంజన్ల నీరు తాగడమే శ్రేష్ఠమని, వాటివల్ల ఎలాంటి సైడ్ ఎఫెక్ట్‌లు ఉండవని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. మట్టితో చేసిన కుండల్లో సహజమైన మినరల్స్, సాల్ట్స్ ఉంటాయి. అందుకే వాటిలో నీరు నిల్వ చేసినప్పుడు ఈ గుణాలన్నీ ఆ నీటిలోకి చేరుతాయి. దాంతో కాలమేదైనా ఆ నీటిని తాగడం వల్ల మనం ఆరోగ్యంగా ఉంటాం. వడదెబ్బ తగలకుండా శరీరాన్ని కాపాడుతుంది. మట్టికుండలను కాల్చినప్పుడు గోడల్లో కంటికి కనిపించని సన్నని రంధ్రాలు సహజంగా ఏర్పడుతాయి. వాటి ద్వారా నీరు కారకపోయినా చెమ్మలా కుండ నుంచి కొద్దిపాటి నీరు బయటకు వస్తుంది. అందువల్ల కుండలోని నీళ్లు సహజ సిద్ధంగా చల్లబడతాయి. దీంతో ప్రజలు వాటివైపే మొగ్గుచూపుతున్నారు.

వంట పాత్రలు సైతం..

మన పూర్వీకులు మట్టి పాత్రల్లోనే ఎక్కువగా వంట చేసుకునేవారు. కానీ కాలక్రమేణా ఆధునిక సాంకేతికత పెరుగుతున్న కొద్దీ అందరూ సహజత్వం వదిలేసి కృత్రిమత్వం వైపు పరిగెడుతున్నారు. మట్టి పాత్రలు మూలకు పడి నాన్‌స్టిక్, స్టీలు, అల్యూమినియం పాత్రలు వంటగదిలోకి వచ్చి చేరాయి. ఈ పాత్రల్లో తక్కువ సమయంలో వండుకోవడమే కాక సులువుగా శుభ్రం చేసుకో వచ్చు. అయితే ఆరోగ్యపరంగా మంచిది కాదని తెలిసినా వాటినే ఎక్కువశాతం వాడుతున్నాం. అయితే వాటి స్థానంలో తిరిగి మట్టితో చేసిన వంట పాత్రలు వచ్చేశాయి. రొట్టెలు కాల్చడానికి పెనాలు, పెరుగు తోడుబెట్టుకోవడానికి పాత్రలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో ఆరోగ్యానికి ప్రాధాన్యతను ఇచ్చే వారు క్రమంగా మళ్లీ మట్టి పాత్రల వైపు మరలుతున్నారు.

మట్టికుండలోని నీరు ఆరోగ్యకరం..

డాక్టర్ ప్రీతి, ఆయుర్వేద వైద్యురాలు, కొడకండ్ల



కుండలకు వాడే మట్టిని బట్టి ఆ కుండయొక్క విశిష్ఠత ఆధారపడి ఉంటుంది. మట్టిపాత్రల్లో వండటం వల్ల పదార్థాలు రుచిగా ఉండటమే కాకుండా, పోషకాలు బయటి పోవు. మట్టిలోని ఆల్కలీన్ స్వభావం ఆమ్లంతో చర్య జరపడం వల్ల పీహెచ్ స్థాయి సమతుల్యం అవుతుంది. తద్వారా జీర్ణ ప్రక్రియ సజావుగా సాగి ఎసిడిటీ సమస్య తలెత్తదు. ఆరోగ్యానికి ప్రాధాన్యతను ఇచ్చేవారు ఇప్పుడిప్పుడే మట్టి పాత్రల వైపు మరలుతున్నారు. ఎండలో బయటకు వెళ్ళే వారు ప్లాస్టిక్ బాటిల్లకు బదులు మట్టితో చేసిన బాటిళ్ళలో తీసుకుపోవడం మంచిది. వడదెబ్బ తగిలిన వారిని నీడలోకి తీసుకెళ్ళి మట్టికుండలోని శుభ్రమైన చల్లని నీటిని తాగిస్తే త్వరగా ఉపశమనం కలుగుతుంది. ప్రతీ రోజు మంచినీటి కండలను శుభ్రం చేసుకుని తాజా నీటితో నింపి వాడుకోవడం శ్రేయస్కరం.

ఛాగల్ గ్రామ దేవతల కమిటీ ఎన్నిక

స్టేషన్‌ఘన్‌పూర్, ఏప్రిల్ 7: మండలంలోని ఛాగల్ గ్రామంలో వివిధ గ్రామ దేవతల పండుగలను నిర్వహించడానికి ఉత్సవ కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బూర్ల రమేష్, గౌరవ అధ్యక్షుడిగా పోగుల సారంగపాణి, ఉపాధ్యక్షులుగా సౌదరపల్లి సంపత్‌రాజు, అన్నెపు అనిల్ కుమార్, చేపూరి ప్రభాకర్, పొన్న రాజేష్, ప్రధాన కార్యదర్శులుగా మాదారపు సందీప్, రంగు అనూప్‌కుమార్, బాస్కుల సుధాకర్, సహాయ కార్యదర్శులుగా బాలగాని అనిల్, పోగుల కార్తీక్, సాంబరాజు, మురళి, శ్రీకాంత్, రాజు, కోశాధికారిగా కూన రాజు, సహాయ కోశాధికారిగా బూర్ల అనిల్, ప్రచార కార్యదర్శులుగా పసునూరి సందీప్‌కుమార్, రాజశేఖర్, హరీష్, సలహాదారులుగా సత్తు రవి, యాట వెంకటయ్య, యాదగిరి, మల్లిఖార్జున్, ధర్మయ్య, కార్యవర్గ సభ్యులుగా సాంబరాజు, సంతోష్, రంగు రాజు, ప్రవీణ్, అనిల్, రాజేష్ ఎన్నికయ్యారు.

బయటకెళ్లాలంటే భయం

స్టేషన్‌ఘన్‌పూర్‌లో కుక్కల బెడద ● ఇళ్లలో తిను బండారాలు ఎత్తుకుపోతున్న కోతులు ● ఆగం చేస్తున్న పందులు



స్టేషన్ ఘన్‌పూర్ వీధుల్లో విహరిస్తున్న కుక్కలు



శివునిపల్లిలో జనావాసాల నడుమ పందుల సంచారం

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, ఏప్రిల్ 7: స్టేషన్‌ఘన్‌పూర్, శివునిపల్లి పట్టణంలో కుక్కలు, కోతుల బెడద తీవ్రంగా ఉంది. ప్రధాన వీధులతో పాటు కాలనీల్లో విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. కుక్కలు ఇళ్లలోకి రావడం.. కోళ్లను ఎత్తుకు పోయి తినడం నిత్యకృత్యమై పోయింది. కోళ్ల, మేకలు, గొర్రె పిల్లలను నోట కరుచుకుని దూరంగా వెళ్లి చంపి తింటున్నాయని గ్రామస్థులు చెబుతున్నారు. వాటితో పాటు పందులు కూడా సంచరిస్తున్నాయని, ఆలయాల్లోకి కూడా వస్తున్నాయి. తిరుమలనాథ స్వామి దేవాలయం, శివాలయం, నగరేశ్వరాలయంలో యథేచ్ఛగా సంచరిస్తున్నాయి. గతంలో పలు కాలనీల్లో, గ్రామాల్లో పలువురిని కుక్కలు కరిచిన సందర్భాలు కూడా ఉన్నాయి. అసలే అంటు వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్న నేపథ్యంలో పందులు, కుక్కలు, కోతులు జనావాసాల్లో సంచరించడం ఇంకా ప్రమాదకరమని గుర్తించాలంటున్నారు. అడవులు తగ్గిపోవడం వల్లనే కోతుల సమస్య ఎదురవుతున్నదని చెబుతున్నారు.

నిద్ర కరువవుతున్నది..

కుక్కలు రాత్రి వేళల్లో గుంపులుగుంపులుగా వీధుల్లో సంచరిస్తున్నాయి. ముఖ్యంగా అర్ధరాత్రి విపరీతంగా మొరుగుతున్నాయి. తెల్లవారు జామున పనుల మీద రోడ్లపై వెళ్లే వారి వెంట పడుతున్నాయి. స్టేషన్ ఘన్‌పూర్‌లో కోతుల బెడద కూడా ఎక్కువగానే ఉంది. తరచుగా ఇళ్లపై పడి ఆహార పదార్థాలు, పండ్లు ఎత్తుకుపోతున్నాయి. ఇళ్లతో పాటు కిరాణ షాపుల్లో కూడా ఇదే పరిస్థితి. ఏమరుపాటుగా ఉంటే కోడిగుడ్లు, బ్రెడ్, బిస్కెట్లు, అరటి పండ్లు, పిండి వస్తువులు ఎత్తుకు పోయి చెట్లపై కూర్చుని తింటున్నాయి. సమస్యను గ్రామ పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకుపోయినా ఫలితంలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా కుక్కలు, పందులు, కోతుల బెడద లేకుండా చేయాలని కోరుతున్నారు.

ఫిర్యాదు చేసినా ఫలితం లేదు..

- నాగేశ్వర్ రావు, స్థానికుడు



ఘన్‌పూర్, శివునిపల్లి పట్టణాల్లో కుక్కలు, కోతులు, పందుల సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నాం. ఈ సమస్యపై పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకుపోయినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా తగిన చర్యలు తీసుకోవాలి.

ఎంతోమందిని గాయపరిచాయి..

- కె.యాదగిరి, ఘన్‌పూర్



కుక్కలు దాడిలో పలువురు గాయపడిన సంఘటనలు ఉన్నాయి. కుక్క కాటుకు గురైతే వ్యాక్సీన్ వేయించుకోవడానికి ఘన్‌పూర్ పీహెచ్‌సీకి నిత్యం వస్తూనే ఉంటారు. తక్షణం కుక్కలను దూరంగా తరిమి వేయడానికి చర్యలు తీసుకోవాలి. అదేవిధంగా పందులు వీధుల్లో తిరగకుండా చర్యలు తీసుకోవాలి.

గడ్డం సమ్మయ్యకు పీఆర్టీయూ సన్మానం



గడ్డం సమ్మయ్యను సన్మానిస్తున్న పీఆర్టీయూ నాయకులు

దేవరుప్పుల, ఏప్రిల్ 7: పద్మశ్రీ అవార్డు గ్రహీత, కళారత్న, హంస అవార్డు గ్రహీత, చిందు యక్షగాన కళాకారుడు గడ్డం సమ్మయ్యను పీఆర్టీయూ నాయకులు సన్మానించారు. ఆయన స్వగ్రామమైన అప్పిరెడ్డిపల్లెలో ఆ శాఖ రాష్ట్ర అధ్యక్షుడు పింగళి శ్రీపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావు సత్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదకుటుంబం నుంచి వచ్చిన సమ్మయ్యకు ఈ అవార్డు రావటం ఆనందంగా ఉందన్నారు. తెలంగాణ కళలను, కళాకారులను ప్రభుత్వం ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. పెద్దబాలశిక్ష చదివిన సమ్మయ్య ప్రస్థానం భావి తరాలవారికి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మహిపాల్‌రెడ్డి, ఎల్లారెడ్డి, అంబటి అంజయ్య, బీకోజీ, కిరణ్‌కుమార్, భీమా, బాలనర్సయ్య, మెతుకు రాజు, గోపికిషన్, మల్లేశం, అనిల్‌కుమార్, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ ఉపాధ్యాయులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

జనగామ కల్చరల్: కేజీబీవీ ఉపాధ్యాయులకు ఉద్యోగ భద్రత కల్పించాలని పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షులు పింగిలి శ్రీపాల్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందిన తరిగొప్పుల కేజీబీవీ బయోసైన్స్ ఉపాధ్యాయురాలు అరుణ జ్యోతి సంస్మరణ సభ ఆదివారం జిల్లా కేంద్రంలోని ఓంసాయి ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ కేజీబీవీ ఉపాధ్యాయులకు ఉద్యోగ భద్రత లేదని, దీని వల్ల అనేక మంది ఉద్యోగుల జీవితాలు రోడ్డున పడే ప్రమాదం ఉందని అన్నారు. ప్రభుత్వంతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూటీఎస్ జనగామ, తరిగొప్పుల, నర్మెట్ట మండల శాఖల సహకారంతో సమకూర్చిన రూ.2 లక్షల చెక్కును రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, బీరెల్లి కమలాకర్‌రావు చేతుల మీదుగా వారి కుటుంబ సభ్యులకు అందించారు.

సీపీఎంతోనే అభివృద్ధి సాధ్యం

జనగామ కల్చరల్, ఏప్రిల్ 7: భువనగిరి పార్లమెంటు పరిధిలో ఉన్న ఏడు నియోజకవర్గాల అభివృద్ధి సీపీఎంతోనే సాధ్యమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి.అబ్బాస్ అన్నారు. ఆదివారం పసరమడ్లలో జరిగిన సీపీఎం గ్రామశాఖ సమావేశానికి గడ్డం ప్రభాకర్ అధ్యక్షత వహించగా అబ్బాస్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పార్లమెంటు ఎన్నికల్లో సీపీఎం అభ్యర్థి జహంగీర్ ను అధిక మెజారిటీ తో గెలిపించాలన్నారు. భారత రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునేందుకు ఎర్రజెండాల ప్రాతినిధ్యం పార్లమెంటులో ఉండాలన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సాంబరాజు యాదగిరి, జిల్లా కమిటీ సభ్యులు సుంచు విజేందర్, నాయకులు అన్నెబోయిన రాజు, బెజ్జరమైన మల్లేశం, గంధమాల యాదగిరి, ఎర్రబోయిన కరుణాకర్, బెజ్జరమైన శ్రీను, బోయిన స్వామి, బోయిని కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని మార్చే కుట్రను అడ్డుకోవాలి

బచ్చన్నపేట, ఏప్రిల్ 7: రాజ్యాంగాన్ని మార్చేందుకు కొన్ని పార్టీలు కుట్రలు చేస్తున్నాయని, దాన్ని అడ్డుకోవాలని జాతీయ మాలమహానాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మల్యాల బాల్‌నర్సయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం వద్ద భారత రాజ్యాంగ పరిరక్షణ యాత్ర కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని వర్గాలు అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో అనేక మంది మేధావులు రాజ్యాంగాన్ని రచిస్తే, కొన్ని పార్టీలు కుట్రపూరితంగా మార్చే యత్నాలు చేస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 2న ఆలంపూర్‌లో ప్రారంభమైన పరిరక్షణ యాత్ర 8న మేడ్చల్‌లో ముగుస్తుందని విద్యార్థి, మేధావులు, ప్రజాస్వామికవాదులు పెద్ద సంఖ్యలో హాజరై మద్దతు తెలపాలని న్నారు. కార్యక్రమంలో తమ్మడి మహేందర్, విజయ భాస్కర్, రమేశ్, క్రాంతికుమార్, శివకుమార్, యాదగిరి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

బచ్చన్నపేట, ఏప్రిల్ 7: మండలంలోని కొన్నె గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన కుచణ సిద్దమ్మ కుటుంబ సభ్యులను బీఆర్‌ఎస్ నాయకులు కోడూరు శివకుమార్‌గౌడ్ ఆదివారం పరామర్శించి రూ.5 వేలు ఆర్థిక సహాయం అందించారు. ఆయన వెంట కుందారపు యాదగిరి, ఎనుగుల రమేశ్ తదితరులు ఉన్నారు.

దేవుడి సొమ్ముకు ఎసరు

(3వ పేజీ తరువాయి)

వినియోగించాలి. ఇందుకు అవసరమైన ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపాలి. ఆమోదం పొందిన తర్వాత నిధులు మంజూరు చేయించుకునేందుకు ప్రయత్నించాలి. కానీ ఉమ్మడి వరంగల్ జిల్లాలోని దేవాదాయశాఖ అధికారులు ఇవేవీ చేయకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఆదాయం ఉన్న దేవాలయాలు వారికి ఏటీఎంలా కనిపిస్తున్నాయి. వాటి ఆదాయాన్ని ఇష్టం వచ్చినట్టు వాడుకుంటున్నారు.

మెట్టుగుట్ట గుడిపై కన్ను..

కాజీపేట శివారు అయోధ్యపురంలో రైల్వేశాఖ ఓవర్ హాలింగ్ వ్యాగన్ వర్క్‌షాపు నిర్మాణానికి సేకరించిన 120 ఎకరాల స్థలానికిగాను పరిహారంగా సుమారు రూ.60 కోట్లను చెల్లించింది. ఆ డబ్బు ఆలయం పేర బ్యాంకులో జమ అయి ఉంది. దీనిపై గతంలోనే బీఆర్‌ఎస్ ప్రభుత్వంలోని దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి కన్నేశారు. తన నియోజకవర్గంలో దుర్గగుడి నిర్మాణానికి రూ.3కోట్లు ఇందులోంచి తీసుకునేందుకు ప్రయత్నించారు. భక్తుల నుంచి నిరసన వెల్లువెత్తడంతో ఆయన ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నారు. ఆ తర్వాత ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన దేవాదాయ శాఖ అధికారుల కన్ను ఈ గుడిపై పడింది. దీంతో తమ కార్యాలయాల కోసం ధార్మిక భవనం నిర్మించుకునేందుకు ఈ గుడి నుంచి రూ.కోటితోపాటు భద్రకాళి, సమ్మక్క - సారలమ్మ జాతర దేవస్థానం నుంచి రూ.కోటి చొప్పున మొత్తం రూ.3కోట్లను గుట్టుచప్పుడు కాకుండా లాగేసుకున్నారు. ఇంతటితో సరిపెట్టుకోకుండా ఈ గుళ్ల నుంచి కేవలం ఫర్నిచర్ కోసం మరో రూ.30 లక్షలను వాడుకున్నారు.

ఫర్నిచర్‌కు రూ.30లక్షలా?

దేవాదాయ శాఖ కార్యాలయాల్లో ఫర్నిచర్ కోసం రూ.30లక్షలు ఖర్చు చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు తమ విలాసాల కోసం ఇంతపెద్ద మొత్తం డబ్బును వెచ్చించడంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో భద్రకాళి దేవాలయంలో దేవాదాయశాఖ కార్యాలయం ఉన్నప్పుడు అందులో రూ.10లక్షలకుపై ఖర్చు చేసి ఫర్నిచర్‌ను కొనుగోలు చేశారు. ఆ తర్వాత అక్కడి నుంచి ఈ కార్యాలయాన్ని వేరే చోటికి మార్చేప్పుడు ఈ ఫర్నిచర్‌ను కూడా తరలించారు. ఆ ఫర్నిచర్ అంతా ఏమైంది? ఇప్పుడు కొత్తగా మరో రూ.30లక్షలతో విలాసవంతమైన ఫర్నిచర్‌ను ఎందుకు కొనుగోలు చేశారు. ఇదంతా ఎవరి ఇళ్లలోకి వెళ్లింది? ఈ బాగోతం బయటపడాలంటే విచారించాలని భక్తులు కోరుతున్నారు.

యువత మత్తుకు బానిస కావద్దు


వర్ధన్నపేట సీఐ సూర్యప్రకాశ్



తమ్మడపల్లి(జి)లో మాట్లాడుతున్న వర్ధన్నపేట సీఐ సూర్యప్రకాశ్

జఫర్‌గడ్, ఏప్రిల్ 7: యువత మత్తుకు బానిస కావద్దని వర్ధన్నపేట సీఐ సూర్యప్రకాశ్ సూచించారు. శనివారం రాత్రి తమ్మడపల్లి(జి)లో జాగృతి పోలీసు కళా బృందం వారు చైతన్య ప్రదర్శనలు నిర్వహించారు. అనంతరం సీఐ సూర్యప్రకాశ్ మాట్లాడుతూ గుట్కా, డ్రగ్స్, గంజాయి వంటి మత్తుకు యువత అలవాటు పడడం వల్ల జీవితాలు నాశనమవుతాయన్నారు. చక్కగా చదువుకుని జీవన ప్రగతిని సాధిస్తూ ఆదర్శంగా నిలవాలన్నారు. మూఢ నమ్మకాలు, విశ్వాసాలను నమ్మవద్దని, శాస్త్రీయ ఆలోచనలతో ముందుకు సాగాలని అన్నారు. సైబర్ మోసాలు, నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. నేరాల నియంత్రణకు గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరమన్నారు. ఈ అంశాలపై కళాకారులు ప్రదర్శించిన నాటికలు, చైతన్య గీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జఫర్‌గడ్ ఎస్ఐ శీలం రవియాదవ్, ఏఎస్ఐ వెంకటనారాయణ, కళా బృంద ఇంచార్జీ నాగమణి, ప్రతినిధులు విలియమ్, వెంకటేశ్వర్లు, రత్నయ్య, శ్రీనివాస్, నారాయణ, విక్రంరాజ్, చిరంజీవి, పోలీసులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష పుష్పార్చన



పుష్పాలంకరణలో అమ్మవారు

జనగామ కల్చరల్, ఏప్రిల్ 7: జనగామ మునిసిపాలిటీ పరిధి 27వ వార్డు అమ్మబావి ఉప్పలమ్మ తల్లి అమ్మవారికి ఆదివారం లక్ష పుష్పార్చన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పూజారి వారణాసి పవన్‌శర్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కిరణ్ అనే భక్తుడు అమ్మవారికి వెండి కిరీటం సమర్పించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి భక్తులు అమ్మవారిని దర్శనం చేసుకొని అమ్మవారి అనుగ్రహం పొందారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ మహంకాళి హరిశ్చంద్ర గుప్తా, ఓరుగంటి శ్రీనివాస్, ఓరుగంటి ఆంజనేయులు, చెంచారపు బుచ్చిరెడ్డి, వీరెడ్డి, ఆరుట్ల శోభ, చిన్నం వంశి, రాజేందర్‌రెడ్డి, మధు, పురోహితులు అవ్వారు ప్రసాద్ శర్మ, రాఘవ శర్మ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల పరిశీలన

జనగామ కల్చరల్, ఏప్రిల్ 7: మండలంలోని శామీర్‌పేట, పసరమడ్ల గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆదివారం ఎంపీపీ మేకల కళింగరాజు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులను తరుగు పేరుతో ఇబ్బందులకు గురి చేయొద్దని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులు కూడా నాణ్యతా ప్రమాణాలు పాటించి కొనుగోలు కేంద్రాలకు సహకరించాలన్నారు. వర్ష సూచన ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శివరాత్రి స్వప్న రాజు, బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు షైన గౌడ్, తాండ్ర సాల్మన్, కొలనుపాక శివరాజ్, బోదాసు ఉప్పలయ్య, నాగభూషణం, కనకయ్య పాల్గొన్నారు.

ప్రైవేట్ ఉపాధ్యాయుడి కుటుంబాన్ని ఆదుకోవాలి

టీపీయూఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి దామెర వేణు

స్టేషన్‌ఘన్‌పూర్, ఏప్రిల్ 7: గుండెపోటుతో అకాల మృతి చెందిన ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయుడు చొప్పరి గణేశ్ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటించి ఆదుకోవాలని తెలంగాణ ప్రైవేట్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సంఘం జిల్లా అధ్యక్షుడు దామెర వేణు కోరారు. ఆదివారం డివిజన్ కేంద్రంలో ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని సేయింట్ పాల్స్ పాఠశాలలో గుండెపోటుతో మృతి చెందిన గణేశ్ కుటుంబాన్ని పాఠశాల యాజమాన్యం ఆదుకోవాలని, అతడి పిల్లలకు ఉచితంగా విద్యను అందించాలని కోరారు. చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులకు ప్రభుత్వం అండగా ఉండాలని, అకాల మృతి చెందిన ఉపాధ్యాయులకు ప్రభుత్వం రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని కోరారు.

33 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

జఫర్‌గడ్, ఏప్రిల్ 7: అక్రమంగా తరలిస్తున్న 33 క్వింటాళ్ల రేషన్ బియాన్ని జఫర్‌గడ్ పోలీసులు పట్టుకున్నారు. ఎన్నికల తనిఖీలో భాగంగా ఉప్పుగల్లు వద్ద శనివారం రాత్రి వాహనాలు తనిఖీలు చేస్తున్న క్రమంలో అక్రమంగా 33.50 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తుండగా పోలీసులు వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్‌కు చెందిన నరేశ్, అంజి అనే ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి, వారిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ రవియాదవ్ చెప్పారు.

వాటర్ ట్యాంకర్‌ను ఢీకొట్టిన లారీ

ట్యాంకర్ డ్రైవర్ మృతి



రోడ్డుపై పడిపోయిన ట్యాంకర్ ఇంజన్, మృతుడు పరశురాములు (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్, ఏప్రిల్ 7: వాటర్ ట్యాంకర్‌ను లారీ ఢీకొట్టిన సంఘటనలో డివిజన్ కేంద్రానికి చెందిన ట్యాంకర్ డ్రైవర్ షైల పరశురాములు (60) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. డివిజన్ కేంద్రానికి చెందిన పరశురాములు జాతీయ రహదారిపై మొక్కలకు నీళ్లు పట్టే వాటర్ ట్యాంకర్‌పై కొంత కాలంగా డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం పల్లగుట్ట క్రాస్‌రోడ్డు వద్ద డివైడర్‌పై మొక్కలకు నీళ్లు పడుతుండగా వెనుకాల నుంచి వచ్చిన ఇసుక లారీ ఢీకొట్టింది. దీంతో ట్రాక్టర్ ఇంజిన్ తలక్రిందులుగా పడిపోయింది. డ్రైవర్ పరశురాములు ఇంజిన్ కిందపడి గాయపడ్డాడు. స్థానికులు వెంటనే అతడిని బయటకు తీసి 108 ద్వారా వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్సపొందుతూ మృతి చెందాడు. ఆయనకు భార్య వెంకటలక్ష్మి, కుమారుడు, కూతురు ఉన్నారు. సీఐ ముస్కు రాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శతాధిక వృద్ధుడి మృతి



సత్యనారాయణ (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్, ఏప్రిల్ 7: మండలంలోని ఛాగల్ గ్రామానికి చెందిన మారోజు సత్యనారాయణ (105) అనే శతాధిక వృద్ధుడు అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్ పోగుల సారంగపాణి బాధితుడి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయనతో పాటు నాయకులు చేపూరి కుమార్, ప్రభాకర్, ఐలపాక శ్రీనివాస్, రాజశేఖర్, రాజు, పొన్న రాజేష్, బాస్కుల సుధాకర్, తదితరులు నివాళి అర్పించారు.

ద్విచక్రవాహనాలు ఢీకొని ఒకరి మృతి

కురవి, ఏప్రిల్ 7 : మండలకేంద్రం శివారు జాతీయ రహదారిపై రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరు మృతి చెందారు. మహబూబాబాద్ మండలం మల్యాలకు చెందిన తరాల సైదులు (40) తన భార్య నీలమ్మతో కలిసి ఖమ్మంలోని ఓ శుభకార్యానికి హాజరై తిరిగి వస్తుండగా కురవిలో గప్‌చుప్ బండినడుపుకునే లావుడ్య రమేష్ వచ్చి ఢీకొట్టాడు. దీంతో సైదులు తలకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. లావుడ్య రమేష్‌కు సైతం గాయాలయ్యాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిబంధనల ప్రకారం సిబ్బందిని నియమించాలి



ప్రిన్సిపాల్‌కు వినతిపత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు

జనగామ కల్చరల్, ఏప్రిల్ 7: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, మాతా శిశు సంక్షేమ కేంద్రంలో పని చేసేందుకు నిబంధనల మేరకు సిబ్బందిని రిక్రూట్ చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాపర్తి రాజు, రాష్ట్ర కార్యదర్శి భైరపాక శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ గోపాల్‌రావుకు, ఎంసీహెచ్ సూపరింటెండెంట్ మధుసూదన్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మెడికల్ కాలేజీలో టీచింగ్, సపోర్టింగ్ స్టాఫ్ నియామకాల్లో సంవత్సరాల తరబడి పని చేస్తున్న సిబ్బందికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అనంతరం మిగిలిన పోస్టుల భర్తీకి నియామకాలు చేపట్టాలన్నారు. ఇప్పటికే పని చేస్తున్న వారికి ప్రాధాన్యత ఇవ్వకుండా కొత్తవారిని నియమిస్తే వారికి అన్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రాందయాకర్, అమృత్ కుమార్, కె.గోపాల కృష్ణ, కె.సాదయ్య, మానస, రాజేష్, స్వప్న, సునీత, తిరుపతి, దేవి, రేణుక, సుశీల, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



మల్యాపూర్‌లో సమ్మేళనానికి హాజరైన 1994-95 బ్యాచ్ విద్యార్థులు

చిలుపూర్, ఏప్రిల్ 7: మండలంలోని మల్యాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. లింగంపల్లికి చెందిన పూర్వ విద్యార్థులు వద్దుల కుమార్, కెంగర్ల రమేష్, తోకల కరుణ నేతృత్వంలో జరిగిన సమ్మేళనానికి 1994-95 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులంతా హాజరయ్యారు. నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుని, ఒకరినొకరు యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సమ్మేళనానికి హాజరైన నాటి ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్‌రెడ్డితో పాటు, ఉపాధ్యాయులు ఆసిరెడ్డి, లింగారెడ్డి, సత్యనారాయణ, ఇంద్రసేనారెడ్డిలను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పున్నం చందర్ రెడ్డి, కుసుమ రవి, రాజు, చంద్రశేఖర్, గోపికిషన్, కొమురయ్య, శైలేందర్, నీలిమ, సుహాసిని, సరిత, రజిత, మాధవి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.